క్లుప్తంగా

గూడూరి ఉమాబాలను కలిసిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు



గూడూరి ఉమాబాలను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

భీమవరం: వైఎస్సార్ సీపీ నర్సాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్ గూడూరి ఉమాబాలను గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. నర్సాపురం పార్లమెంట్ ఇన్‌చార్జ్‌గా నియామకం పొందినందుకు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గూడూరి జగదీష్ తదితరులు ఉన్నారు.

సీనియర్ టైలర్లకు సత్కారం



భీమవరంలో సీనియర్ టైలర్లను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: ప్రపంచ దర్జీల దినోత్సవం (టైలర్స్ డే) సందర్భంగా విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరంలో సీనియర్ టైలర్లను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ సబ్ ఇన్‌స్పెక్టర్ అల్లూరి ప్రసాదరాజు మాట్లాడుతూ 1846లో ఫిబ్రవరి 28న విలియం హో కుట్టు మిషన్‌ను కనుగొని ఎంతో మందికి ఉపాధి అవకాశాలు కల్పించారన్నారు. సమాజంలో మనం ధరించే దుస్తులు గౌరవంతో పాటు హోదాను కల్పిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, నరమామిడి గంగారామ్, ప్రసాదరాజు, ఇందుకూరి శివాజీ వర్మ, అరసవల్లి మణికంత వెంకటేష్, చింతపల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆదిత్య స్కూల్లో సైన్స్ దినోత్సవం



భీమవరం ఆదిత్య స్కూల్లో విద్యార్థులు తయారుచేసిన సైన్స్ ఎగ్జిబిట్స్ ప్రదర్శన

భీమవరం: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఆదిత్య స్కూల్లో బుధవారం సైన్స్‌ఫేర్ నిర్వహించారు. ముందుగా నోబెల్ అవార్డు గ్రహీత సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సైన్స్ ఎగ్జిబిట్స్ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ టి శ్రీనివాస్, బీవై సుధ, ఎస్‌కే బాబా, ప్రణీత్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన బాలల హక్కుల కమిషన్ సభ్యుడు



కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీని కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న రాజేంద్రప్రసాద్

భీమవరం: రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌గాంధీని కలెక్టరేట్‌లో బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో బాలలకు సంబంధించిన వివిధ సమస్యలను రాజేంద్రప్రసాద్ కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో మహిళా అభివృద్ధి, సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుజాతరాణి, జిల్లా ప్రొఫెషన్ ఆఫీసర్ దుర్గాప్రసాద్, బాలల సంరక్షణాధికారి రాజేష్ పాల్గొన్నారు.

టీడీపీ కుళ్లు రాజకీయాలు సిగ్గుచేటు

పోడూరు: టీడీపీ కుళ్లు రాజకీయాలు సిగ్గుచేటని తూర్పుపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఇటీవల తూర్పుపాలెంలో 50 మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలు టీడీపీలో చేరినట్లు ప్రకటించడాన్ని వైఎస్సార్ సీపీ ఆ గ్రామ నాయకులు గుబ్బల శ్రీనివాస్, ఇరింకి శ్రీనివాస్, ఆచంట ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీరబ్రహ్మం, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు గొట్టుముక్కల ఏసురత్నం, మేడిచర్ల పండు, దిగమర్తి ప్రసాద్ తీవ్రంగా ఖండించారు. టీడీపీ కండువాలు వేసుకున్నవారిలో వైఎస్సార్ సీపీ నాయకుల్లేరని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో తూర్పుపాలెం గ్రామం నిర్లక్ష్యానికి గురైందని, మాజీ మంత్రి, ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు వచ్చాక గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని వివరించారు. తమ గ్రామంలోనే నివాసాన్ని, కార్యాలయాన్ని ఏర్పాటు చేసుకుని ఆచంట నియోజకవర్గంలోనూ, జిల్లాలోనూ తూర్పుపాలెంకు ప్రత్యేకవన్నె తెచ్చిన ఘనత ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజుకే దక్కుతుందని కొనియాడారు.

నెరవేరిన రెండు దశాబ్దాల కల

- డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు
- యండగండిలో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



యండగండిలో 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు

ఉండి: యండగండి ప్రజల రెండు దశాబ్దాల నాటి కల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో నెరవేరిందని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అన్నారు. బుధవారం యండగండిలో ఏపీఈపీడీసీఎల్ నిధులు రూ.5.2 కోట్లతో నిర్మించిన 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో 115 రోజుల్లో విద్యుత్ సబ్‌స్టేషన్ వేగంగా నిర్మాణం చేపట్టిన అధికారులను ఈ సందర్భంగా ఆయన అభినందిస్తున్నట్లు తెలిపారు. యండగండితో పాటుగా ఉణుదుర్రు, పాందువ్వ, ఆరేడు, రాయనివానిగూడెం, సాగిపాడు, మైప గ్రామాల ప్రజలు విద్యుత్ ఇబ్బందులను చాలా భరించారని ఇప్పుడు విద్యుత్ వెలుగులతో కళకళలాడతాయని అన్నారు. ఈ సబ్‌స్టేషన్ ద్వారా 5,259 గృహ వినియోగదారులకు, 168 మంది వాణిజ్య సముదాయాలకు, 429 మంది ఆక్వా రైతులకు నాణ్యమైన విద్యుత్ అందుతుందన్నారు. ఇప్పటికే గ్రామంలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.59 కోట్లు అందించామన్నారు. 3 జనన్న కాలనీల్లో 318 మంది ఇళ్లు నిర్మించుకున్నారని అన్నారు. గ్రామంలో వాటర్ ట్యాంకులు, పైపు లైన్ విస్తరణ పనులు పూర్తయ్యాయని తెలిపారు. నియోజకవర్గంలో ఇప్పటికే ఆకివీడు, గుమ్ములూరు, యండగండిలో విద్యుత్ సబ్‌స్టేషన్లు ప్రారంభించినట్లు తెలిపారు. దీనివల్ల నియోజకవర్గంలోని ఉండి, ఆకివీడు, కాళ్ళ, పాలకోడేరు మండలాల్లో విద్యుత్ సమస్యలు పరిష్కారమయ్యాయని అన్నారు. ఆక్వా రైతులకు ఈ వేసవిలో మరింత నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి మరింతగా కొనసాగాలంటే జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ముఖ్యమంత్రిగా ఉండాలని అన్నారు. అందుకే ప్రజలంతా ఆయనను మరోసారి ఆశీర్వదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, ఏఎంసీ చైర్మన్ బొక్కా వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ దత్తాల సుజాతరాణి, ఈఈ ఫీర్‌అహ్మద్‌ఖాన్, డీఈఈ ఎల్‌వీ శ్రీనివాస్, ఏఈఈలు ఎం మాధవరాజు, వీ ప్రసాదరాజు, బాలం తులసి, కూనపరాజు వర్మ, టమటమల గోపాల కృష్ణమూర్తి, వేగేశ్న వేణు, వెలగపల్లి టోనీ, వర్ధనపు ప్రసంగి, కడలి శ్రీను తదితర వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

శివరాత్రికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి



భీమవరంలో శివరాత్రి ఉత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

భీమవరం: మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని భీమవరంలోని వీరమ్మ పార్క్ వద్ద గల పార్వతీసమేత భోగలింగేశ్వరస్వామి ఉత్సవాల కరపత్రాలను బుధవారం స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ మార్చి 6న ప్రారంభమయ్యే ఉత్సవాలు 10వ తేదీతో ముగుస్తాయన్నారు. ఉత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లాలు, కట్రెడ్డి సీతారామయ్య, యర్రంశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కి ఘన స్వాగతం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న గుణ్ణం నాగబాబు, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ పెండ్ర వీరన్న, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ వాసు, చెల్లెం ఆనందప్రకాష్, మాజీ ఎమ్మెల్యే అల్లు వెంకట సత్యనారాయణ, మంతెన యోగీంద్రకుమార్, గాదిరాజు సుబ్బరాజు

భీమవరం: పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలో వివాహ వేడుకకు హాజరయ్యేందుకు బుధవారం కాళ్ల మండలం పెదఅమిరంలోని హెలీప్యాడ్‌కు చేరుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. స్వాగతం పలికిన వారిలో గుణ్ణం నాగబాబు, జాయింట్ కలెక్టర్ ఎస్.రామ సుందర్‌రెడ్డి, ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు, ఎస్సీ కమిషన్ సభ్యుడు చెల్లెం ఆనంద ప్రకాష్, అటవీ శాఖ డైరెక్టర్ మంతెన యోగేంద్రబాబు, క్షత్రియ సేవాసమితి అధ్యక్షుడు గాదిరాజు సుబ్బరాజు, మాజీ ఎమ్మెల్యే అల్లు సత్యనారాయణ, గూడూరి శ్రీనివాస్, చీర్ల రాధాయ్య, యడ్ల తాతాజీ, పేరిచర్ల విజయనర్సింహరాజు తదితరులున్నారు.

సీవీ రామన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలి



భీమవరంలో జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

భీమవరం: ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి, విద్యాశాఖ ఆధ్వర్యంలో భీమవరం ఏఆర్‌కేఆర్ హైస్కూల్లో బుధవారం జిల్లాస్థాయి జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్‌కాస్ట్ జిల్లా సమన్వయాధికారి మల్లుల శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్య జీవితంలో ఎదురయ్యే ఎన్నో సమస్యలకు సైన్స్ పరిష్కారం చూపుతుందని అన్నారు. స్కూల్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు బి సాయిప్రసాద్ మాట్లాడుతూ సీవీ రామన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు శాస్త్రవేత్తలుగా ఎదగాలన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన చిత్రలేఖనం, వ్యాస రచన, వక్తృత్వం, క్విజ్ పోటీలు, సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. విజేతలకు పుస్తకాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం సోమేశ్వరరావు, సీహెచ్ శివబ్రహ్మం, వైవీ బుచ్చిరాజు, వి నాగేశ్వరరావు, వై సురేష్ , జె జాన్సీరాణి, ఆర్ నాయుడు, కె భాగ్యలక్ష్మి, పి వాణిశ్రీ పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాల స్వామి ప్రతిష్ఠ మహోత్సవం



పాలకోడేరులో విగ్రహ ప్రతిష్ఠ పూజలో పాల్గొన్న డీసీసీబీ చైర్మన్ పీవీఎల్



మంత్రి కారుమూరి నాగేశ్వరరావుకు జ్ఞాపికను అందజేస్తున్న నిర్వాహకులు

పాలకోడేరు: పాలకోడేరులో గరువు మారెమ్మ గుడి సెంటర్లో నూతనంగా నిర్మించిన వేణుగోపాల స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కొత్తపల్లి రామరాజు లక్ష్మీకాంతం దంపతుల ఆధ్వర్యంలో బుధవారం కన్నుల పండుగగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నరసింహరాజు, ఉండి ఎమ్మెల్యే మంతెన రామరాజు, తణుకు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు, రాష్ట్ర ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మంతెన యోగీంద్ర కుమార్ (బాబు), పాలకోడేరు మండలం వైఎస్సార్ సీపీ నాయకులు కొత్తపల్లి కాశీ విశ్వనాథరాజు, సర్పంచ్ ఇంజేటి మరియమ్మ, ఉపసర్పంచ్ దెందుకూరి వెంకట్‌రాజు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రతిష్ఠ మహోత్సవాన్ని కనులారా వీక్షించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహణ కమిటీ సభ్యులు, యాదవ సంఘం వారు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి, అన్నదాన కార్యక్రమానికి సహకరించిన దాతలకు, భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

శాస్త్ర సాంకేతికతను రైతులకు చేరువ చేయాలి



కేవీకేలో డ్రోన్ పనితీరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

ఉండి: రైతులకు శాస్త్ర, సాంకేతికతను చేరువ చేయగలిగితేనే వ్యవసాయ రంగం మరింతగా అభివృద్ధి చెందుతుందని విస్తరణ సంచాలకుల ప్రతినిధి డాక్టర్ ఎస్ ముకుందరావు అన్నారు. బుధవారం ఎన్నార్పీ అగ్రహారం కేవీకేలో శాస్త్ర సాంకేతిక సలహా మండలి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేవీకేలో చేపడుతున్న కార్యక్రమాలను శాస్త్రవేత్తలు, అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ డీ శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథి ముకుందరావు మాట్లాడుతూ డ్రోన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు అందించగలిగితే వ్యవసాయంలో రైతులు మరింత అభివృద్ధి సాధిస్తారని అన్నారు. రైతులకు లాభదాయకమైన వెదజల్లే పద్ధతిలో సాగు విస్తీర్ణాన్ని పెంచాలని సూచించారు. పశుసంవర్ధక శాఖ డీడీ హెచ్ హుస్సేన్ మాట్లాడుతూ పశువులకు పశుగ్రాసం అందించేలా కేవీకేలో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం పలువురు రైతులను శాస్త్రవేత్తలు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మార్టేరు శాస్త్రవేత్త డాక్టర్ ఎం దక్షిణామూర్తి, శాస్త్రవేత్తలు డాక్టర్ వరప్రసాద్‌రెడ్డి, రాఘవేంద్ర, ఎన్ దెబోరామెస్సియానా, ఏ శ్రీనివాసరావు, ఏ రాజేష్, బీ రజిత, ప్రియదర్శిని, పల్లంరాజు, సలహా మండలి సభ్యుడు సీహెచ్ వెంకటేశ్వరరావు, బద్రి, బ్రహ్మానందం, కిశోర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు బోధనలు సమాజానికి అనుసరణీయం



భీమవరంలోని టిడ్కో కాలనీలో చర్చిని ప్రారంభిస్తున్న శాసన మండలి చైర్మన్ మోషేన్‌రాజు

భీమవరం అర్బన్: ఏసుక్రీస్తు బోధనలు సమాజానికి అనుసరణీయమని రాష్ట్ర శాసన మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. భీమవరంలోని తాడేరు రోడ్డులోని టిడ్కో కాలనీలో యోవేలు మినిస్ట్రీ చర్చిని బుధవారం మోషేన్‌రాజు ప్రారంభించి మాట్లాడుతూ కష్టాల్లో ఉన్నప్పుడు నమ్మకంతో ఏసుక్రీస్తు ప్రభువును ప్రార్థిస్తే ఆ సమస్యలు తొలగిపోతాయన్నారు. ఏసుక్రీస్తు ఆశీర్వాదం ప్రజలందరిపై ఉండాలని ప్రార్థించారు. ముందుగా చర్చి పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, సంఘ పెద్దలు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం: భీమవరం వన్‌టౌన్ ఏరియా విద్యుత్ మరమ్మతులు కారణంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ చెప్పారు. పట్టణంలోని టిడ్కో-2 సబ్‌స్టేషన్ 11 కెవి ఎంప్లాయిస్ కాలనీ ఫీడర్ పరిధిలోని లెప్రసీ కాలనీలోని గాంధీనగర్, బ్రిడ్జిపేటలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని తెలిపారు.

కన్నుల పండువగా రాములోరి విగ్రహం ప్రతిష్ఠ



ఆనందపురంలో కొలువైన సీతారాములు

కాళ్ల: ఆనందపురం గ్రామం ఆధ్యాత్మిక చింతనతో నిండిపోయింది. కోదండరామాలయం ప్రతిష్ఠ, అభయాంజనేయ స్వామి విగ్రహావిష్కరణ కార్యక్రమాలు బుధవారం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామమంతా భక్తిపారవశ్యంతో నిండిపోయింది. వేదమంత్రాల నడుమ హనుమద్ సీత, లక్ష్మణ భరత, శత్రుఘ్న సహిత శ్రీరామచంద్ర స్వామి విగ్రహాలను ప్రతిష్ఠించారు. అభయాంజనేయ స్వామి విగ్రహాన్ని భక్తుల నడుమ వేద మంత్రాలతో భక్తి శ్రద్ధలతో ప్రారంభించారు. భక్తులు, దాతలు, గ్రామ ప్రజల సహాయ సహకారాలతో నూతనంగా నిర్మించిన కోదండరామాలయం, అభయాంజనేయ స్వామి విగ్రహాలు ప్రారంభోత్సవంలో పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. పలువురు రాజకీయ ప్రముఖులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఉద్దరాజు శ్రీనివాసరాజు, ముదునూరి సాయిరాజు, బందారు దుర్గారావు, కమిటీ సభ్యులు, భక్తులు, గ్రామ పెద్దలు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఘనంగా సోమేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠ



సోమేశ్వరస్వామి ఆలయ ప్రతిష్ఠలో పాల్గొన్న చీఫ్‌విప్ ముదునూరి

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో పార్వతీ సోమేశ్వరస్వామివారి నూతన ఆలయ, పునఃప్రతిష్ఠ మహోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ పూజల్లో ప్రభుత్వ చీఫ్‌విప్, ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ భక్తి ప్రపత్తులతో మెలిగేందుకు దైవ ఆరధన దోహదపడుతుందని, ఆలయ పునఃప్రతిష్ఠలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. బ్రహ్మశ్రీ కాళ్లకూరి దుర్గా ప్రసాద్ శర్మ, మంచిలి పురుషోత్తమశర్మల నేతృత్వంలో శాస్త్రోక్తంగా వేద ఆగమ పండితుల సహచర్యంతో నిర్వహించారు. పార్వతీ సోమేశ్వర స్వామివార్ల విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు భారీ అన్నసమారాధన ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మైలాబత్తుల సోని, జెడ్పీటీసీ బొక్కా రాధాకృష్ణ, గ్రామ సర్పంచ్ గుబ్బల యమున భానుమూర్తి, ఎంపీటీసీ సంగాని దుర్గా భవాని, ఆలయ కార్యనిర్వాహణాధికారి పులగం వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో వడ్డీ, రైతు భరోసా సొమ్ము

యలమంచిలి: మండలంలోని 1,355 మంది రైతులకు వడ్డీ సబ్సిడీ రూ.16,79,982 జమైనట్టు మండల వ్యవసాయాధికారి చింగలూరి దేవి బుధవారం తెలిపారు. 2021-22 రబీ రుణాలకు సంబంధించి 306 మందికి రూ.3,20,856, ఖరీఫ్ 2022 రుణాలకు 1049 మంది రైతులకు రూ.13,59,126 వడ్డీ సబ్సిడీ కింద నగదు వారి బ్యాంకు ఖాతాలో జమైనట్టు చెప్పారు. అదే విధంగా రైతు భరోసా, పీఎం కిసాన్ మూడో విడతకు సంబంధించి 6,732 మంది రైతులకు రూ.1,34,64,000 జమైందన్నారు.

మావుళ్లమ్మ ఆలయానికి రూ.1,01,116 విరాళం అందజేత

భీమవరం(ప్రకారం చౌక్): భీమవరం ఇలవేల్పు మావుళ్లమ్మ ఆలయంలో నిత్యాన్నదానానికి అల్లు వెంకాయమ్మ జ్ఞాపకార్థం, వెంకాయమ్మ కుమార్తె అల్లు రాజరాజేశ్వరి రూ.1,01,116 విరాళంగా అందజేసినట్లు దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లు రాజారాజేశ్వరి పురంధరదాసు కీర్తనల ప్రముఖ గాయకురాలు అని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరుపున కూడా కీర్తన కార్యక్రమం నిర్వహిస్తున్నారన్నారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రకటన

[illegible]

పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు



సమావేశంలో పాల్గొన్న కౌన్సిలర్లు, మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ

నరసాపురం: పట్టణంలో పారిశుధ్యం మెరుగుదలకు చర్యలు చేపడతామని మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ అన్నారు. బుధవారం నరసాపురం మున్సిపల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ అధ్యక్షతన నిర్వహించారు. పలువురు కౌన్సిలర్లు మున్సిపాలిటీలో శానిటేషన్ అధ్వానంగా ఉంటుందని ధ్వజమెత్తారు. పారిశుద్య కార్మికులు రికార్డుల్లో చూపిస్తున్నంత మంది హాజరు కావడంలేదన్నారు. కౌన్సిలర్లు షకినేటిపల్లి సురేష్, కేసరి గంగరాజు, కోటిపల్లి సురేష్‌లు శానిటేషన్‌పై ప్రశ్నించారు. దీనికి చైర్‌పర్సన్ సమాధానమిచ్చారు. వీధి దీపాల నిర్వహణపై సభ్యులు అడిదల శ్యామల, కావలి రామసీత ప్రశ్నించారు. మున్సిపల్ షాపులు అద్దెకు పాడుకుని, వారికి సకాలంలో షాపులు అందివ్వని కారణంగా వారు చెల్లించిన డిపాజిట్లు తిరిగి వెనక్కి ఇచ్చేయాలని తీర్మానం చేశారు. వైస్ చైర్మన్ కొత్తపల్లి నాని, కౌన్సిలర్లు వంగా శ్రీకాంత్ కన్నా, వైకేఎస్, మల్లాడి శేషవేణి, పతివాడ పద్మ, షేక్ అబేధాసుల్తానా, వన్నెంరెడ్డి శ్రీనివాస్, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ 16కి వాయిదా

భీమవరం: జాతీయ లోక్ అదాలత్ మార్చి 16వ తేదీకి వాయిదా పడిందని భీమవరం మండల న్యాయ సేవాధికారి సంస్థ చైర్ పర్సన్, 3వ అదనపు జిల్లా జడ్జి పి శ్రీసత్యాదేవి చెప్పారు. మార్చి 9న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను 16వ తేదీకి మార్పుచేసినట్లు ఆమె తెలిపారు. మార్పును గమనించి న్యాయవాదులు, కక్షిదారులు , పోలీస్ అధికారులు కేసులను మార్చి 16వ తేదీన రాజీ చేసుకోడానికి సిద్ధం కావాలన్నారు. ప్రతిరోజు ఉమ్మడి జిల్లాల శాశ్వత లోక్ అదాలత్ చైర్ పర్సన్ సమక్షంలో నిర్వహించే భార్య భర్తల కుటుంబ తగాదాలను గూగుల్ మీట్ ద్వారా నిర్వహిస్తున్న కౌన్సెలింగ్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని శ్రీసత్యాదేవి తెలిపారు.

స్వర్ణోత్సవ భవనం ప్రారంభం

పాలకొల్లు సెంట్రల్: దాతలు విద్యాభివృద్ధికి సహకారం అందించాలని చాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ అధ్యక్షుడు కారుమూరి వెంకట నరసింహరావు అన్నారు. బుధవారం స్థానిక చాంబర్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఏర్పాటుచేసి 50 ఏళ్లు పూర్తికావస్తున్న సందర్భంగా దాతల సహకారంతో నిర్మాణం చేసిన స్వర్ణోత్సవ భవనం అదనపు తరగతి గదులు భవనాన్ని ప్రారంభించారు. నరసింహరావు మాట్లాడుతూ దాతలు అల్లూరి విజయలక్ష్మి, కలిదిండి జయలక్ష్మి, పెద్దిబొట్ల లక్ష్మీనారాయణ, అల్లూరి సీతారామరాజు, కలిదిండి రామరాజు, చుండూరి వెంకట నారాయణరావుతో పాటు దాతల సహకారంతో ఆరు బ్లాక్‌లుగా 12 రూంలు నిర్మించామని వివరించారు. సెక్రటరీ కలిదిండి రామరాజు, ట్రెజరర్ జల్లూరి రామలింగేశ్వరరావు, ఛాంబర్స్ సెక్రటరీ దేవరపు లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ డాక్టర్ డి వెంకటేశ్వరరావు, శ్రీఖాకొల్లు కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.